క్లుప్తంగా

ప్రక్కిలంకలో రామాలయంలో ప్రతిష్ఠ మహోత్సవాలు



ప్రక్కిలంక శ్రీరామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవ పూజల్లో దంపతులు

తాళ్లపూడి: ప్రక్కిలంకలోని కాళింగపేటలో పునః నిర్మించిన రామాలయ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం ప్రారంభం అయ్యాయి. 6వ తేదీ వరకూ ఈ వేడుకలు జరుగుతాయి. కొలవరపు విశ్వనాథశర్మ, ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి గణపతి పూజ, పుణ్యావచనం, దీక్షాధారణ, వాస్తు పూజ, అగ్ని ప్రతిష్ఠ, జలాధివాసం, క్షీరాధివాసం తదితర పూజలు నిర్వహించారు. యాగశాలలో నిర్వహించిన పూజల్లో 30 మంది దంపతులు పాల్గొన్నారు. వీరవల్లి రామమోహనరావు శ్రీరామ వైభవం గురించి వివరించారు. 6న సీతా, లక్ష్మణ, హనుమత్ సమేత రామచంద్రమూర్తి, గణపతి, అయ్యప్ప విగ్రహాల ప్రతిష్ఠాపన జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'గన్నమని' స్మారక ప్రతిభా పరీక్షకు 79 మంది

ఉండ్రాజవరం: స్థానిక నంబర్–1 ప్రాథమిక పాఠశాలలో శనివారం గన్నమని శేషగిరిరావు స్మారక ప్రతిభా పాటవ పరీక్షలు– 2023 నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పీవీఎస్ నాగరాజు మాట్లాడుతూ మొత్తం 84 మందిలో 79 మంది ఈ పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఏటా మండలంలోని ప్రతి పాఠశాల నుంచి 5వ తరగతి చదువుతున్న ముగ్గురు చొప్పున విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారని వివరించారు.

జగ్జీవన్ విగ్రహం అక్కడే ఏర్పాటు చేయాలి

నల్లజర్ల: విజయవాడ స్మృతి వనంలో ఏర్పాటు చేసే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం పక్కనే 125 అడుగుల ఎత్తైన బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు కోరారు. ఎమ్మార్పీఎస్ సమావేశం నల్లజర్లలోని రహదారి బంగ్లా వద్ద శనివారం ఉదయం ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిబ్బిలి వెంకటరాజు అధ్యక్షతన జరిగింది. వెంకటరాజు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మాదిగల పట్ల వివక్ష చూపుతోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాదిగలకు రెండు, మాలలకు నాలుగు సీట్లు కేటాయించడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మాదిగలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించేందుకు విజయవాడలో మార్చి24న నిర్వహించే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఆ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి యంత్రపాటి ఇజ్రాయిల్ రాజు, మండల శాఖ అధ్యక్షులు మద్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో లారీ, బైక్

పెరవలి: అతివేగం ఒకరి ప్రాణాన్ని బలిగొంది. పెరవలి ఎస్సై ఎం.సూర్య భగవాన్ తెలిపిన వివరాలివి. మండలంలోని కాకరపర్రుకు చెందిన బొక్క వాసుదేవ్ (20) పంపన శ్రీరాములు అనే ఇద్దరు శుక్రవారం అర్ధరాత్రి బైక్‌పై కాకరపర్రు నుంచి పెరవలి వస్తున్నారు. ఈ క్రమంలో పెరవలి వద్ద ఆగి ఉన్న లారీని వారు వెనుక నుంచి వేగంగా ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలైన వాసుదేవ్ అక్కడికక్కడే మృతి చెందగా శ్రీరాములకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హుటాహుటిన తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెరవలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలకు నవధాన్యాలు

- 12 గ్రామాల్లో ప్రకృతి సాగుకు సన్నాహాలు
- 18 నుంచి 33 విభిన్న జాతుల విత్తన కిట్లు సిద్ధం
- అన్నదాతలకు అండగా ప్రకృతి వ్యవసాయ విభాగం



అనంతపల్లిలో నవధాన్యాల సాగును పరిశీలిస్తున్న మాస్టర్ ట్రైనర్ ఉమామహేశ్వరరావు (ఫైల్)

నల్లజర్ల: 'నేలకు నవధాన్యాల సాగు' పేరుతో ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. సంప్రదాయ పంటల సాగుకు అండగా నిలవడం, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, భూసారాన్ని పెంచడం, ప్రజలకు సహజమైన ఆహార ఉత్పత్తులు అందించడం దీని ఉద్దేశం. ఇందుకోసం ప్రకృతి వ్యవసాయ విభాగం విశేషంగా పనిచేస్తోంది. ఆ విభాగం ఏపీసీఎన్ఎఫ్ విభాగం మాస్టర్ ట్రైనర్ ఉమామహేశ్వరరావు ఆ వివరాలు అందించారు. ఈ ఏడాది నల్లజర్ల మండలంలోని 12 గ్రామాల్లో 800 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా రైతులను సన్నద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు 40 రోజుల ముందు మూడో పంట సాగు కోసం 33 రకాల పప్పుధాన్యాలు, నూనెజాతులు, చిరు, తృణ ధాన్యాల, విభిన్న జాతుల ఆకుకూరల విత్తనాలతో కూడిన 13 కిలోల కిట్లను నామమాత్రపు ధరకు రైతులకు అందిస్తున్నారు.

డ్వాక్రా సంఘాల ద్వారా విత్తన కిట్లు

రసాయన ఎరువులు వాడకుండా భూసారాన్ని పెంచడం, మూడో పంటను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయ విభాగం నేలకు నవధాన్యాల సాగు అనే పేరుతో ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ప్రీమాన్ సూయింగ్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) పథకం కింద పప్పుధాన్యాలు, నూనె, తీగజాతి, చిరుధాన్యాలు, తృణధాన్యాలైన పెసర, మినుము, నువ్వులు, వేరుశనగ, రాగులు, కందులు, జొన్నలు వంటి 33 రకాల విభిన్న జాతుల విత్తనాలు ఈ కిట్‌లో ఉంటాయి. నవధాన్యాల పేరిట ఈవిత్తన కిట్లు డ్వాక్రా సంఘాల ద్వారా తయారు చేయించి రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందించనున్నారు.

ఇవీ ప్రయోజనాలు..

- భూమిలో నవధాన్యాలు చల్లి పచ్చిరొట్ట ఎరువుగా పెంచడం వల్ల భూమి సారవంతం అవుతుంది.
- ఏడాది పొడవునా భూమి పచ్చగా ఉంటుంది.
- వేరు వ్యవస్థలోని బొడిపెల ద్వారా భూమికి పోషకాలు అందుతాయి.
- ప్రధాన పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు అన్నిరకాల పోషకాలను భూమి సమృద్ధిగా వృద్ధి చేసుకుంటుంది.
- నవధాన్యాల సాగు ద్వారా రైతుకు అధిక ఆదాయంతో పాటు పశువులకు గ్రాసం, తద్వారా పాలలో వెన్న శాతం పెరుగుతుంది.

మూడేళ్లుగా సాగు చేస్తున్నా..



మూడేళ్లుగా నవధాన్యాల సాగు చేస్తున్నాను. మధ్యలో ఒకేడాది మానేశాను. తేడా కన్పించింది. తొలకరిలో ఎరువుల వినియోగం బాగా తగ్గింది. నవ ధాన్యాల సాగులో వచ్చే ఆకుకూరలు, మినుము, పెసర, కందులు వంటివి ఇంటి అవసరాలకు వాడుతున్నాం. పచ్చిరొట్టను పశుగ్రాసంగా వినియోగిస్తున్నాం. మిగిలిన వాటిని భూమిలో కలియ దున్నుతున్నాం.

– కాకర్ల శ్రీరామచంద్రమూర్తి, రైతు, శింగరాజుపాలెం

రైతులకు లాభదాయకం



నవధాన్యాల సాగు రైతులకు ఎంతో లాభదాయకం. వీటిని సాగు చేయడం ద్వారా సహజ సిద్ధంగా భూసారం పెరుగుతుంది. పర్యావరణానికి మేలు జరుగుతుంది. ప్రధాన పంటకు ఎరువులు, పురుగు మందుల వాడకం తగ్గి రైతుకు పెట్టుబడి ఆదా అవుతుంది.

– ఉమామహేశ్వరరావు, సీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్, నల్లజర్ల

కాకినాడ వెళ్లి పింఛను అందజేత



ఆస్పత్రిలో పింఛను అందిస్తున్న వలంటీర్ ప్రియాంక, వెల్ఫేర్ అసిస్టెంట్ ముంతాజ్ బేగం

నిడదవోలు రూరల్: మండలంలోని శెట్టిపేటకు చెందిన రెండేళ్ల చిన్నారి చెట్టే దయానా శాంతి 'స్పైనల్ మస్క్యులర్' వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్‌లో వైద్యం పొందుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ఆదేశాలతో ఆ చిన్నారికి పెన్షన్ మంజూరు చేశారు. దీంతో శెట్టిపేట గ్రామ వలంటీర్ యల్లమెల్లి ప్రియాంక, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ యామిర్ ముంతాజ్ బేగం కలిసి శనివారం రాత్రి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి తన క్లస్టర్ పరిధిలోని చిన్నారి దయానా శాంతి తల్లి సూర్యకుమారికి రూ.5 వేల పెన్షన్ సొమ్ము అందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు పశివేదల విద్యార్థి

కొవ్వూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి మార్చి ఒకటో తేదీ వరకూ చిత్తూరు జిల్లా నగరిలో నిర్వహించిన అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పశివేదల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎస్.దుర్గాప్రసాద్ ప్రతిభ కనబరిచాడు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం జి.రత్నకుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి దుర్గా ప్రసాద్‌తో పాటు పీడీ జీవీ నాగతులసిని హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

లే అవుట్లలో మౌలిక వసతులకు ప్రాధాన్యం

- గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ మాధవీలత సూచన
- చాగల్లు జగనన్న కాలనీ సందర్శన



చాగల్లులో గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

చాగల్లు: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాధవీలత శనివారం చాగల్లులోని జగనన్న కాలనీని సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడి గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా అందించిన ఇంటి స్థలంలో లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. నిర్మాణాలు చేపట్టకపోతే ఇతరులు ఆ స్థలాలను ఆక్రమించుకోవడం వంటి సమస్యలు ఎదురవుతాయని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం కొంత శ్రమతో కూడుకున్నదైనా, తర్వాత మీ వారసులకు ఒక ఆస్తిపై హక్కును అందించగలుగుతారన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వమే ఇసుక, ఇతర నిర్మాణ ముడి సరకులతో పాటు నీటి వసతిని ఉచితంగా కల్పిస్తోందన్నారు. నిర్మాణం పూర్తయినంత మేర బిల్లులను కూడా దశలవారీగా ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేస్తున్నారన్నారు. ఇంటి నిర్మాణంతో పాటు రూ.2500 విలువ చేసే విద్యుత్తు మీటర్, విద్యుత్తు కనెక్షన్‌ను ఉచితంగా అందజేస్తున్నామని చెప్పారు. చాగల్లు జగనన్న లే అవుట్‌లో 636 గృహాలు మంజూరవగా, వాటిలో 113 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణాలు వేగవంతం అయ్యేలా సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇందిరమ్మ కాలనీకి త్వరలో కుళాయి కనెక్షన్లు

జగనన్న కాలనీకి ఆనుకుని ఉన్న ఇందిరమ్మ కాలనీ వాసులు కలెక్టర్‌ను కలిశారు. తాము ఎదుర్కొంటున్న రోడ్లు, తాగు నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్ ఆ కాలనీలోని ఇంటింటికీ రూ.51 లక్షల వ్యయంతో త్వరలోనే కుళాయి కనెక్షన్లు ఇస్తారని ప్రకటించారు. అలాగే ఇందిరమ్మ కాలనీ నుంచి మెయిన్ రోడ్ వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్, ఎంపీడీవో బి.రాంప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ నిరంజన్‌కుమార్, హౌసింగ్ ఏఈ కె.ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రత పాటిస్తేనే ప్రమాదాల నివారణ

- ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు
- ఆంధ్రా షుగర్స్‌లో కార్మికులకు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ త్రినాథరావు

కొవ్వూరు: రసాయన కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు విధిగా నిర్దేశిత భద్రతా ప్రమాణాలు పాటించాలని ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.త్రినాథరావు సూచించారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో శనివారం సాయంత్రం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవ తప్పిదాల వల్లే ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని త్రినాథరావు అన్నారు. కర్మాగారంలో ఎక్కడైనా భద్రతా లోపాలను గుర్తిస్తే కార్మికులు వెంటనే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ మాక్ డ్రిల్‌పై అవగాహన పెంచుకుంటే చాలా వరకూ ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఫ్యాక్టరీ భద్రతాధికారి కేవీవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను ఇతర కార్మికులతో పంచుకోవాలని కార్మికులకు సూచించారు. కొత్తగా విధుల్లో చేరిన సిబ్బంది భద్రతా ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే సీనియర్ కార్మికులు భద్రతా నియమాలను అలక్ష్యం చేసినా ప్రమాదాలు జరగ వచ్చన్నారు. ఈ ఏడాది మాదిరిగానే వచ్చే ఏడాది కూడా ప్రమాద రహిత కర్మాగారంగా ఆంధ్ర షుగర్స్‌కు పేరు తీసుకు రావాలని కార్మికులకు సూచించారు. భద్రతా వారోత్సవాల సందర్భంగా కార్మికులు, ఉద్యోగులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు, ఇతర అతిథుల చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. ఫ్యాక్టరీ హెచ్ఆర్ సీహెచ్ సుఖ మహర్షి, కొవ్వూరు, సగ్గొండ కర్మగారాల ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

వేడుకగా మదనగోపాలుడి రథోత్సవం



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేద స్వస్తి నిర్వహిస్తున్న పండితులు



తాళ్లపూడిలో మదనగోపాల స్వామివారి రథోత్సవం

తాళ్లపూడి: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలుడి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. డోలుసన్నాయి, మేళతాళాల మధ్య తాళ్లపూడి వీధుల గుండా వైభవంగా రథోత్సవం సాగింది. అర్చకులు సాయికృష్ణ, రాజగోపాల్ ఆధ్వర్యంలో తొలుత స్వామి వారిని పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. సర్పంచ్ నక్కా అనురాధ, నక్కా చిట్టిబాబు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా రథాన్ని అగ్నికుల క్షత్రియులు లాగారు. దారిపొడవునా రథానికి మహిళలు నీళ్లు పూలు చల్లి, హారతులు ఇచ్చారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యుడు పసిన రాధాకృష్ణ, గోకవరపు సూరిబాబు, గోకవరపు బాబులు, గోకవరపు రమేష్, బొర్రా శ్రీరామచంద్రమూర్తి, సాలన ఉమ, మాణిక్యం, కంకిపాటి వినయ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉండ్రాజవరంలో కేశవస్వామి ఊరేగింపు

ఉండ్రాజవరం: స్థానికంగా కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం భక్తులు స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మ్యూజికల్ బ్యాండ్, సన్నాయి మేళంతో స్వామివారిని గ్రామంలో వైభవంగా ఊరేగించారు. కాగా శుక్రవారం రాత్రి 10 గంటలకు స్వామి వారికి కన్నుల పండువగా కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు, కార్యనిర్వహణాధికారి మీసాల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గోష్పాద క్షేత్రంలో వేద శాస్త్రసభ

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని కళావేదికపై శనివారం వేద శాస్త్రసభ నిర్వహించారు. గోష్పాదక్షేత్ర వేద శాస్త్రాభివర్ధక పరిషత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు, ఘనాపాఠీలు వేదస్వస్తి నిర్వహించారు. గుళ్లపల్లి ఆంజనేయ, గుళ్లపల్లి దత్తాత్రేయ, విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, చల్లా విశ్వనాథ శాస్త్రి ఘనపాఠీల పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేద శాస్త్ర సభతో గోష్పాద క్షేత్రం మార్మోగింది. వేద శాస్త్రాభివర్ధక పరిషత్ అధ్యక్షుడు డీఆర్ఎస్ఎన్ శాస్త్రి, కార్యదర్శి కలిగోట్ల కృష్ణారావు, పిల్లలమర్రి సర్వేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమం

స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పాదేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి తెలిపారు. ఉదయం స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు, లలితా దేవికి కుంకుమార్చనలు, బిల్వార్చన అనంతరం రుద్రహోమం నిర్వహించనున్నట్లు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ పూజలు కొనసాగుతాయన్నారు.

సీపీఎం నాయకుడు సోమసుందరం మృతి

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు పిచ్చుకల సోమసుందరం (81) శుక్రవారం రాత్రి మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమసుందరం పార్థివ దేహంపై పార్టీ జెండా కప్పి సీపీఎం జిల్లా నాయకులు ఉండవల్లి కృష్ణారావు, వడాల గంగాధర్, జువ్వల రాంబాబు, సీఐటీయు నాయకులు ఎస్.భగత్, కొత్తగుండ రత్నాజీ తదితరులు నివాళులు అర్పించారు. సోమసుందరం మృతదేహానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

'గంద్రోతు'కు మంత్రి వనిత పరామర్శ



కోదండ రామారావును పరామర్శిస్తున్న మంత్రి వనిత

కొవ్వూరు: పట్టణ కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గంద్రోతు కోదండ రామారావును హోం మంత్రి తానేటి వనిత శనివారం రాత్రి పరామర్శించారు. కోదండ రామారావు సతీమణి వీరమణి ఇటీవల మృతి చెందారు. దీంతో మంత్రి పట్టణంలో ఆయన స్వగృహానికి వెళ్లి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివ రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గంద్రోతు అంజనీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గజ్జరంలో హౌసింగ్ అవగాహన ర్యాలీ

తాళ్లపూడి: మండలంలో గృహ నిర్మాణాల వేగవంతానికి అధికారులు కృషి చేస్తున్నారని ఎంపీడీవో ఎం. రాజశేఖర్ అన్నారు. గజ్జరం గ్రామంలోని జగనన్న లే అవుట్ వద్ద శనివారం గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి మిగిలిన వారు కూడా గృహ నిర్మాణాలు త్వరగా చేపట్టాలని కోరారు. ఎంపీడీవో మాట్లాడుతూ గృహ నిర్మాణదారులు ఎదుర్కొంటున్న నీరు, విద్యుత్తు వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి రాంబాబు, హౌసింగ్ ఏఈ సుబ్బరాజు, పంచాయతీ కార్యదర్శి హేమంతి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ స్టేషన్‌లో అదనపు ఎస్పీ తనిఖీలు

దేవరపల్లి: స్థానిక ఎస్ఈబీ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా అదనపు ఎస్పీ పిట్టా సోమశేఖర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నల్లజర్ల మండలం పోతిసీడిపాలెం, గుండేపల్లి వద్ద ఎర్ర కాలువ ఇసుక ర్యాంపులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ డి.సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై రెవెన్యూ శాఖ విచారణ

నల్లజర్ల: పోతవరం శివార్లలో జిల్లా ప్రధాన రహదారిపై భారీ వృక్షాల నరికివేతపై పత్రికల్లో వచ్చిన కథనానికి రెవెన్యూ శాఖ స్పందించింది. నల్లజర్ల తహసీల్దార్ కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు వీఆర్వో రాంబాబు, వీఆర్ఏ గంగరాజు శనివారం ఘటనా స్థలానికి వెళ్లి ఎన్ని చెట్లు నరికారు? అవి ఏ సైజులో ఉండేవి? రహదారికి ఎంతదూరంలో ఉన్నాయి? వాటివల్ల ప్రయాణికులకు, వాహనదారులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అనే విషయాలను పరిశీలించి తహసీల్దార్‌కు నివేదిక సమర్పించారు. తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కిశోర్‌కుమార్ తెలిపారు.